సాక్షి
సంగారెడ్డి
సోమవారం । 27 । జనవరి । 2025



నృత్యం చేస్తున్న చిన్నారులు



జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి. (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న కలెక్టర్ క్రాంతి

# అభివృద్ధి, సంక్షేమం దిశగా..

**కలెక్టర్ వల్లూరు క్రాంతి** | **ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు**



అమ్మవారి వేషధారణలో చిన్నారి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**నాలుగు పథకాల అమలు ప్రారంభం**

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేలు అందిస్తామన్నారు. అదేవిధంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు.

**సంగారెడ్డి జోన్:** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధితో జిల్లా ప్రగతి పరుగులు పెడుతోందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్ ఆవరణలో కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలోని వివిధ శాఖల్లో విశిష్ట సేవలందించిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పతకాలను బహూకరించి, అభినందించారు. వివిధ రంగాలలో సాధిస్తున్న అభివృద్ధిని సంబంధిత శాఖ అధికారులు శకటాలతో ప్రదర్శించారు. అదేవిధంగా అభివృద్ధి సంక్షేమ పథకాల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలోని మహిళలకు తెలంగాణ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం ఇప్పటికే కల్పించామన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2.20కోట్ల మందికిపైగా మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని వివరించారు. ఫలితంగా మహిళలకు రూ.99.66 కోట్లకుపై ఆదా అయిందని వెల్లడించారు. మహాలక్ష్మి ద్వారా రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు మహిళా శక్తి సమాఖ్యతో రూ.ఒక కోటి 99 లక్షల వ్యయంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

**డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ**

జిల్లాలో డీఎస్సీ 2024 ద్వారా 551 పోస్టులకు గాను 415 పోస్టులు భర్తీ చేసినట్లు కలెక్టర్ క్రాంతి వివరించారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పాఠశాలల్లో సాయంత్రం అల్పాహారం కోసం రూ.52.31కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

**రహదారుల మరమ్మతులు**

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతుల పనులకు రూ.221.14కోట్ల అంచనా వ్యయంతో 1,614 పనులు మంజూరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీ భవనాల కోసం రూ. 26.40 కోట్ల అంచనా వ్యయంతో 32 పనులు మంజూరయ్యాయని, పనులు పురోగతిలో ఉన్నట్లు వివరించారు. సింగూరు ప్రాజెక్టు ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాలువల మట్టి పనులు కట్టడాల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ ఫీల్డ్ చానల్స్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నట్లు తెలిపారు.

**డ్రగ్స్‌పై ఉక్కుపాదం**

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఆర్‌వో పద్మజరాణి, అధికారులు సాయిబాబా, జ్యోతి, లలిత కుమారి, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతికి బాటలు వేయాలి: ఎస్పీ



ఎస్పీ కార్యాలయం ఆవరణలో జెండా వందనం చేస్తున్న ఎస్పీ రూపేశ్ తదితరులు

**సంగారెడ్డి జోన్:** దేశ పౌరులుగా దేశ ప్రగతికి తోడ్పాటు అందించేందుకు సరిహద్దులకు వెళ్లి శత్రుదేశాలతో యుద్ధం చేయాల్సిన అవసరం లేదని, మనకు కేటాయించిన విధుల్ని అంకిత భావంతో నిర్వహించి, ప్రగతికి బాటలు వేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ పేర్కొన్నారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ఆరు గ్యారంటీల అమలుకు కృషి

**టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి**



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి

**కొండాపూర్(సంగారెడ్డి):** ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. అధికారులే స్వయంగా గ్రామాలకు వచ్చి దరఖాస్తులు తీసుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల వద్దకు పాలన అనేలా ఉందని వ్యాఖ్యానించారు. మండల కేంద్రమైన కొండాపూర్‌లో నాలుగు గ్యారంటీలలోభాగంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒకేసారి నాలుగు గ్యారంటీలను అమలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ పథకాలు అమలు చేయాలి

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సదాశివపేటరూరల్(సంగారెడ్డి):** అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎల్లారం గ్రామంలో ఆదివారం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఉపాధిహామీ పథకంలో మట్టి పని చేసే కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని కోరారు. అదేవిధంగా అసంపూర్తిగా మిగిలిపోయిన రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు

**జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న**



ముచ్చర్లలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న

**హత్నూర(సంగారెడ్డి):** అర్హులైన లబ్ధిదారులు ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న స్పష్టం చేశారు. హత్నూర మండలం ముచ్చర్ల గ్రామంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ... ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు పథకాలను ముమ్మరంగా చేపట్టడం జరిగిందన్నారు. అర్హులై ఉండి ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఏపీవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

**మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు**



బహుమతులను అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

**రామచంద్రాపురం (పటాన్‌చెరు):** విద్యార్థులలో పోటీతత్వం పెరగడం వలన వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని ఎంపీ ఎం.రఘునందన్‌రావు పేర్కొన్నారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లాపూర్‌లో విద్యార్థులకు సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసినవారమవుతామన్నారు. ప్రపంచం సైన్స్‌పైనే ఆధారపడి ఉందని దానిని దృష్టిలో పెట్టుకుని చిన్నారులను సైన్స్ రంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం పోటీలో గెలుపొందిన విద్యార్థులకు రఘునందన్‌రావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ, సభ్యులు రవి రమణ, రవీందర్, సైన్స్‌ఫెయిర్ కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు శంషాబాద్ రాజు, రాంబాబు గౌడ్‌లు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో ప్రత్యేక పాలన

- అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ
- జిల్లాలో ముగిసిన పాలకవర్గం గడువు



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం

**సంగారెడ్డి జోన్:** జిల్లాలోని మున్సిపాలిటీల పాలకవర్గం పదవీకాలం ఆదివారంతో ముగిసింది. దీంతో ఆయా మున్సిపాలిటీలు ప్రత్యేక పాలనలోకి రానున్నాయి. సంగారెడ్డి, సదాశివపేట, అందోల్-జోగిపేట, నారాయణ ఖేడ్ మున్సిపాలిటీలకు సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ప్రత్యేక అధికారిగా నియమితులు కాగా, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ మున్సిపాలిటీలకు జేడీఎంఏ, సీఅండ్‌డీఎంఏ ఫల్గుణ్ కుమార్ ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారుడికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న హరిచందన, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

- రోడ్లు భవనాల ముఖ్య కార్యదర్శి హరిచందన
- లబ్ధిదారులకు ప్రజాపాలన పథకాల మంజూరు పత్రాల పంపిణీ

**జహీరాబాద్:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల ముఖ్య కార్యదర్శి హరిచందన స్పష్టం చేశారు. మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో ఆదివారం సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచి బహుమతి ఇచ్చారన్నారు. ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలను ఆదివారం నుంచే అందిస్తున్నారని తెలిపారు. వీటి కోసం పేదలు గత ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. అర్హుల పేర్లు ఎక్కడైనా తప్పిపోయినా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గ్రామంలో సుమారు 400 మంది లబ్ధిపొందబోతున్నారన్నారు. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ... సాగుకు అనువైన ప్రతీ ఎకరాకు ఏడాదికి రూ.12వేల వంతున సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయా పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, ఆర్డీవో రామ్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి భిక్షపతి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఏవో లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు.

**కేతకీలో పూజలు**

**ఝరాసంగం(జహీరాబాద్):** శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి హరిచందన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయాధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెకు ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు, అందించి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీకలెక్టర్ మనోజ్, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, ఆర్డీవో రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ పాల్గొన్నారు.

## లాంఛనం పూర్తి.. అమలే మిగులు

- ప్రారంభమైన నాలుగు సంక్షేమ పథకాలు
- 25 మండలాల్లో ప్రజాపాలన గ్రామసభలు
- మండలానికి ఒక గ్రామం చొప్పున మాత్రమే నిర్వహణ
- మున్సిపాలిటీల్లో తర్వాత..



ఇసోజిపేటలో లబ్ధిదారుకు మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

**సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/పుల్‌కల్ (అందోల్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాలు జిల్లాలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు జారీ, రైతు భరోసా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఆయా పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాల (ప్రొసీడింగ్ కాపీ)లను ఆదివారం అందజేశారు. ప్రజాపాలన కార్యక్రమాల పేరుతో జిల్లాలోని 25 మండలాల్లో ఈ పథకాలను ప్రారంభించారు. ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి తొలిరోజు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో ఈ లబ్ధిదారుల జాబితాను ప్రకటించిన అధికారులు ప్రజాప్రతినిధులు వాటికి సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక విషయంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద అభ్యంతరాలేవీ రాలేదు. లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేని వారు అక్కడి అధికారులను సంప్రదించగా ఈ పథకాల అమలు అనేది నిరంతర ప్రక్రియని రానున్న రోజుల్లో అందరికి లబ్ధి చేకూరుతుందని దరఖాస్తుదారులకు సర్దిచెప్పి పంపించారు.

**మంజూరు పత్రాల అందజేత**

మంత్రి దామోదర రాజనర్సింహ పుల్కల్ మండలం ఇసోజీపేట, అందోల్ మండలం నేరెడుగుంటల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ ప్రజాపాలన గ్రామసభలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సదాశివపేట మండలం ఎల్లారంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

**ప్రజలకు సీఎం సందేశం..**

ప్రజాపాలన గ్రామ సభల్లో ఈ పథకాలకు సంబంధించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని అధికారులు గ్రామస్తులకు చదివి వినిపించారు.

**మున్సిపాలిటీల్లో తర్వాత..**

ప్రజాపాలన సభలు ప్రస్తుతానికి మున్సిపాలిటీల్లో జరగలేదు. పట్టణాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులు ఉండరు. కేవలం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు సంబంధించిన లబ్ధిదారులు మాత్రమే ఉంటారు. ఈ రెండు పథకాలకు సంబంధించిన ప్రజాపాలన వార్డు సభలను రానున్న రోజుల్లో నిర్వహించే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## హిందూత్వ.. కార్పొరేట్ మోడ్‌లో బీజేపీ

**సీపీఐ(ఎం) ప్రతినిధుల ప్రారంభ సభలో పార్టీ సమన్వయకర్త ప్రకాశ్ కరత్**




ప్రసంగిస్తున్న ప్రకాశ్ కరత్

**కొండాపూర్(సంగారెడ్డి):** హిందూత్వ సిద్ధాంతం, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడటమనే రెండు స్తంభాల మీద ఆధారపడి బీజేపీ మనుగడ సాగిస్తోందని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఆ పార్టీ సమన్వయకర్త ప్రకాశ్ కరత్ వ్యాఖ్యానించారు. విశాల ప్రజా ఉద్యమాల ద్వారా వాటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. వీటితోపాటు సరళీకరణ ఆర్థిక విధానాలు, సామాజిక అణచివేత, కుల వివక్ష పోరాడాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. సొంత బలాన్ని పెంచుకోవటంతోపాటు వామపక్షాల ఐక్యత కోసం కృషి చేయాలని సూచించారు. సంగారెడ్డి పట్టణం (సీతారాం ఏచూరి నగర్, మల్లు స్వరాజ్యం ప్రాంగణం)లో కొనసాగుతున్న సీపీఐ (ఎం) నాలుగో రాష్ట్ర మహాసభలు ఆదివారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ...గత మూడేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో పలు మార్పులు సంభవించాయన్నారు. ఇతర దేశాలు, ప్రజలందరూ శాంతిని కోరుకుంటున్న తరుణంలో అమెరికా మాత్రం ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో మన భారత్ కూడా ఇజ్రాయెల్‌కు మద్దతునివ్వటం శోచనీయమన్నారు. ఇప్పుడు అమెరికాలో అధికారాన్ని చేపట్టిన ట్రంప్ 'అమెరికా ఫస్ట్'అనే నినాదాన్ని ఇవ్వటం ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా, వాణిజ్యపరంగా ఇతర దేశాలపై ఆధిపత్యాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పలు దేశాల్లో మితవాద శక్తులు అధికారంలోకి వస్తున్న క్రమంలోనే శ్రీలంకలో అనూర కుమార దిసనాయకే అధికారంలో వచ్చారని, ఇదే కాకుండా బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, మెక్సికోల్లో సైతం వామపక్ష శక్తులు అధికారంలోకి వచ్చాయని గుర్తు చేశారు. ఇదే సమయంలో అమెరికాకు సాగిలబడుతున్న మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం ఆ దేశానికి అనుకూలంగా ఉంటోందని విమర్శించారు. మన దేశంలో 63 సీట్లు తక్కువగా వచ్చినప్పటికీ మిత్రుల సహకారంతో మోదీ మూడోసారి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ హిందూత్వ ఎజెండాలో ఎలాంటి మార్పు లేదన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్న ప్రస్తుత తరుణంలో అందులో పేర్కొన్న ప్రజాస్వామ్య లౌకిక, సమాఖ్య విలువలకు మోదీ సర్కారు తిలోదకాలిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం జాతీయ నాయకులు నాగయ్య, పోతినేని సుదర్శన్,జ్యోతి , జాన్‌వెస్లీ,అబ్బాస్‌తోపాటు జిల్లా సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా


### ఆలయంలో చోరీ

నర్సాపూర్: నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న శీతల మాత ఆలయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయం గ్రిల్స్‌కు వేసిన తాళం పగులగొట్టి లోపలికి చేరి హుండీ తాళం ధ్వంసం చేశారు. అందులో ఉన్న డబ్బును ఎత్తుకుపోయారు. గర్భగుడి తాళం సైతం పగులగొట్టి లోపలికి వెళ్లినా అందులో ఏం ఎత్తుకెళ్లలేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా హుండీని ఇటీవల తెరిచి అందులో ఉన్న డబ్బును లెక్కించి ఆలయ నిర్వహణకు వినియోగించారు. అందులో తక్కువ డబ్బు ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈవిషయమై ఎస్ఐ లింగంను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, సీసీ కెమెరాలు పరిశీలించి దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

అలాగే మరో ఇంట్లో చోరీకి యత్నించారు. పట్టణంలోని ఓ ఉద్యోగి ఇంటి తాళం పగులగొట్టి సెంటర్ లాక్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తుండగా చుట్టుపక్కల వారు లేవడంతో పారిపోయారు.

### గుర్తుతెలియని వ్యక్తుల సంచారంతో కలకలం

ఆందోళన చెందుతున్న కాలనీ వాసులు



సీసీ కెమెరాలో రికార్డు అయిన గుర్తు తెలియని వ్యక్తి ఫొటో

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం వేకువజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినట్లు, ఇళ్లల్లోకి చొరబడే ప్రయత్నం చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. స్థానికులు తెలిపిన ప్రకారం శ్రీనగర్ కాలనీ రోడ్డు నెంబర్ 10లో ఓ వ్యాపారస్తుడి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి ముందుకు వచ్చినట్లు రికార్డు అయింది. ఒక ఇంటి నుంచి మరో ఇంటిలోపలికి దూకి వచ్చినట్లు గుర్తించారు. ఇలా వేకువ జామునే ఎవరో కొందరు అనుమానాస్పద వ్యక్తులు కాలనీలో సంచరిస్తూ ఇండ్లల్లోకి రావడంపై కాలనీవాసులు, మహిళలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై స్థానిక పోలీసులు స్పందించి వెంటనే విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

### బైండోవర్ ఉల్లంఘన: తండ్రీ కొడుకుకు జైలు

చిన్నశంకరంపేట(మెదక్): బైండోవర్ ఉల్లంఘనలో ఇద్దరిని జైలుకు పంపినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. మండలంలోని కామారం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకు హలావత్ బీమా, రాజ్‌కుమార్ గతేడాది ఫిబ్రవరిలో కాపారం తండా శివారులో మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన ఆకుల శ్రీనివాస్ పొలంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పోలీసులు కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. అయినప్పటికీ వారు పద్ధతి మార్చుకోకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరికి చెరి రూ. 2 లక్షల జరిమానా చెల్లించాలని, బైండోవర్ కాలం పూర్తయ్యే వరకు జైలు శిక్ష విధించారు. జరిమానా చెల్లించలేకపోవడంతో ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు ఆదివారం ఎస్ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వైద్యుడు మృతి

పటాన్ చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వైద్యుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, మజీద్‌బండకు చెందిన కళ్యాణ్ వర్మ (43) వైద్యుడు శనివారం రాత్రి తన కారులో వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా రామచంద్రపురం పరిధిలోని నాగులపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఆకస్మాత్తుగా అడవి పంది రోడ్డుకు అడ్డంగా రావడంతో దానిని తప్పించబోయి ఫ్లైఓవర్ సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో వైద్యుడి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# వీరికి పండుగ... వారికి దండగ

- నష్టాల బాటలో టమోటా ● భారీగా పడిపోయిన ధరలు
- పెట్టుబడైనా దక్కడం లేదు ● మహారాష్ట్ర నుంచి కూడా ఒకేసారి పంట
- ● శీతల గిడ్డంగులు లేక దెబ్బతీసిన వైనం



టమోటా సాగు చేస్తున్న రైతులకు తిప్పలు తప్పడంలేదు. వాతావరణంలో మార్పు,గిట్టుబాటు ధర లేక దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం టమోటా ప్రజలకు పండుగ, రైతులకు దండగ అన్నట్లుంది. కనీసం పంటను దాచుకునేందుకు శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజీ) లేక తక్కువ ధరకే విక్రయిస్తూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గతంలో కిలో వంద పలికిన టమోటా ప్రస్తుతం రూ.పదికి మించి కొనడం లేదు. రూ.వేలు పెట్టిన పెట్టుబడైనా దక్కడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జహీరాబాద్ టౌన్:

జిల్లా నేలలు, వాతావరణం టమోటా సాగుకు అనుకూలంగా ఉంది. మిగతా కూరగాయలతో పోలిస్తే టమోటా అధిక విస్తీర్ణంలో రైతులు పండిస్తున్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, మనూర్, న్యాల్‌కల్, కోహీర్, కొండాపూర్, ఝరాసంగం తదితర మండలాల్లో టమోటా అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. జిల్లాలో ఈ ఏడాది 500 ఎకరాల్లో టమోటా పంట ఉంది. ఈ సంవత్సరం టమోటా నారు అందుబాటులో ఉండటం వల్ల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

**డిమాండ్ కన్నా మార్కెట్‌కు రెట్టింపు సంఖ్యలో సరఫరా...**

జహీరాబాద్ హోల్‌సేల్ మార్కెట్‌లో టమోటా గణనీయంగా రావడంతో ధరలు బాగా పడిపోయాయి. దీనికి తోడు మహారాష్ట్రలోని షోలాపూర్, నాసిక్ తదితర ప్రాంతాల్లో రైతులు టమోటాలను విస్తారంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి అందుతుండటం ఒకేసారి అధికంగా సరఫరా కావడం వల్ల ధరలు భారీగా పతనమయ్యాయి. జహీరాబాద్ మార్కెట్‌కు ఈ ప్రాంతంతో పాటు మహారాష్ట్ర నుంచి పదుల సంఖ్యలో బాక్స్‌లలో టమోటా వస్తుంది. డిమాండ్ కన్నా దాదాపు రెట్టింపు రావడం వల్ల ధరలు పడిపోవడానికి కారణమైంది. నెల రోజుల క్రితం కిలో రూ.20 అమ్ముడుపోయింది. ప్రస్తుతం వదిరూపాయలకు ఎవరూ కొనేందుకు ముందుకు రావడంలేదు. ధరలు తగ్గడం వల్ల వినియోగదారులకు మేలు జరిగినా రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

**సాగుతో నష్టపోయా...**

ఐటీఐ చేసి మహీంద్ర కర్మాగారంలో పనిచేస్తుంటి. సొంత పొలం ఉండటంతో పనిమానేసి కూరగాయలు పండిస్తున్న. ఇప్పటి వరకు మూడుసార్లు టమోటా పండించి నష్టపోయా. టమోటా పండించడం, అమ్మడం చాలా కష్టంగా ఉంది. హోల్‌సేల్ మార్కెట్‌లో 22 కిలోల బరువున్న బాక్స్ రూ.70 నుంచి రూ.100 వరకు అమ్ముడుపోతుంది. కూలీలు,ఆటో చార్జీలు, కమీషన్ పోను ఈ ధరల వల్ల బాక్స్‌కు పది రుపాయలు చేతి నుంచి కట్టాల్సివస్తుంది. ఈ ధరలు చూసి టమోటాలను పొలం వద్దనే విసిరేయాలనిపిస్తుంది.

– తెలుగు శ్రీనివాస్,రైతు, కంబాలపల్లి



# ఇదెక్కడి ప్రభుత్వం..?

- ● ఉద్యోగులే సర్కార్ మీద కోర్టుకా..?
- ● గాలిలో దీపంలా రిటైర్మెంట్ బెనిఫిట్స్
- ● మరో కొత్త నాటకానికి సర్కార్ తెర
- ● ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తా
- ● ఎమ్మెల్యే హరీశ్‌రావు



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించిన హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్యోగులు ఎదురుచూసే పరిస్థితి చాలా దురదృష్టకరం. ఈ విషయంపై బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం మీద వత్తిడి తెస్తా' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం రాత్రి సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంశం గాలిలో దీపంలా మారిందన్నారు. ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం హైకోర్టుకు వెళ్లారని, ఇప్పటికే సుమారు 300మంది కోర్టుకు వెళ్తే వడ్డీతో సహ ఆరు వారాల్లో డబ్బులు చెల్లించాలని న్యాయస్థానం ప్రభుత్వానికి సూచనలు చేసిందన్నారు. సుమారు 9 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారని, ఒక్కరికి డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మరో నాటకం తెర మీదకు తెచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లు అంటూ కొత్త కథ పేరిట లీకులు ఇస్తుందని విమర్శించారు. ఉద్యోగులకు డీఏ అనేది న్యాయబద్ధంగా వచ్చే హక్కుగా అభివర్ణించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల స్నేహ పూర్వకంగా సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏసిబి కేసులు, ఉద్యోగుల వేధింపులు పెరిగాయన్నారు. ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం మీద వత్తిడి తెస్తానని, అసెంబ్లీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని అన్నారు.

# అదృశ్యమై.. శవమై తేలిన విద్యార్థి

సదాశివపేట (సంగారెడ్డి): మునిపల్లి పరిధిలోని లింగంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్ నుంచి సోమవారం సాయంత్రం అదృశ్యమైన విద్యార్థి (18), ఆదివారం సదాశివపేట పరిధిలోని కొత్తచెరువులో శవమై తేలాడు. పోలీసుల కథనం ప్రకారం..లింగంపల్లి రెసిడెన్షియల్ హాస్టల్లో ఇంటర్ సెకండియర్ చదువుతున్న మహేందర్‌రెడ్డి సంక్రాంతి సెలవులకు స్వగ్రామం అనంతసాగర్‌కు వచ్చాడు. సెలవుల అనంతరం ఈనెల 20న సోమవారం కళాశాలకు వెళ్లి లగేజ్ పెట్టి హాస్టల్‌లో విద్యార్థులు ఎవరు రాలేదని ఇంటికి వస్తానని తండ్రి రామకష్టారెడ్డికి ఫోన్‌లో తెలిపారు. ఇంటికి రావద్దు అక్కడే ఉండి మంచిగా చదువుకోమని తండ్రి సూచించాడు. అదే రోజు సాయంత్రం హాస్టల్ నుంచి ఎవరికి చెప్పకుండా మహేందర్‌రెడ్డి బయటకి వచ్చాడు. హాస్టల్లో మహేందర్ రెడ్డి లేడని ఇంటికి వచ్చాడా లేదా అని హాస్టల్ సిబ్బంది సోదరుడు నరేందర్ రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా బంధువుల వద్ద ఇతరుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు.. 23న మునుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం సదాశివపేట కొత్తచెరువులో శవమై కనిపించాడు. శవాన్ని బయటకు తీసి మృతుడు మహేందర్ రెడ్డి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

# సత్యనారాయణ మృతికి సంతాపం

పలువురు నాయకులు, ఎమ్మెల్యేలు సంతాపం



సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, చింతా ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: సీనియర్ పాత్రికేయులు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతిపట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెదక్ ప్రజల పక్షాన పోరాడిన మహోన్నత వ్యక్తి సీనియర్ పాత్రికేయులు ఆర్.సత్యనారాయణ అని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సత్యనారాయణ పార్థివదేహానికి హరీశ్ రావు, నీలం మధు ముదిరాజ్, టీయూడబ్ల్యూజేఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే.ఫైజల్ అహ్మద్ నివాళులర్పించారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీయూడబ్ల్యూజేఐజేయూ బండారు యాదగిరి, కార్యదర్శి విష్ణు ప్రసాద్, మల్లికార్జున్ రెడ్డి, మురళీధర్ శర్మ ,పానుగంటి కృష్ణ తదితరులు ఉన్నారు.

# సురభిలో తల్లీబిడ్డ సంరక్షణ స్కీం

- ● ఆస్పత్రిలో ఉచిత వెయ్యి డెలివరీలు పూర్తి
- ● వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ హరీందర్‌రావు



హరీందర్‌రావుకు కేక్ తినిపిస్తున్న రఫీ

సిద్దిపేటఅర్బన్: గ్రామీణ ప్రాంత ప్రజలు, పేదలు సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న తల్లీబిడ్డ సంరక్షణ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని సురభి వైద్యవిజ్ఞాన సంస్థ చైర్మన్ సురభి హరీందర్ రావు పిలుపునిచ్చారు. ఈ స్కీంలో భాగంగా నిర్వహించిన ఉచిత డెలివరీలు వెయ్యి పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ఉన్న ఆస్పత్రిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లీబిడ్డ సంరక్షణ స్కీంను 2022 జులైలో ప్రారంభించామన్నారు. నేటికి వెయ్యి డెలివరీలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినా, అనుకోని ప్రమాదం జరిగినా పేద ప్రజలు భరించలేని విధంగా మెడికల్ ఖర్చులు పెరిగిపోయాయన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని పేద ప్రజలకు మెరుగైన వైద్యం తక్కువ ఖర్చులో అందించాలన్నదే తమ సంకల్పం అని అన్నారు. ఉచితంగా డెలివరీలు చేయడంతో పాటు నిరంతరం డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అంతకుముందు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వైద్య కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ విఖ్యాత్ రావు, డీన్ మహమ్మద్ రఫీ, మెడికల్ డైరెక్టర్ రాంప్రసాద్, ప్రిన్సిపాల్ రమణకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ దినేష్ సింగ్, అడిషనల్ సూపరింటెండెంట్ గోపీచందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ కరుణాకర్, గైనిక్ హెచ్ఓడీ తొగరికర్, డాక్టర్లు శివలత, సౌజన్య, దివ్య, మనీష, పీజీ డాక్టర్లు, పీఆర్వో పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

# అక్క మందలించిందని..

హల్దీవాగులో దూకి వ్యక్తి బలవన్మరణం



రవి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిసైన వ్యక్తి.. అక్క మందలించిందని వర్గల్ మండలం నాచారం హల్దీ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్‌కు చెందిన ముద్దుల రవి (25) దినసరి కూలీ. ఇతనికి భార్య మంజుల అయిదేళ్లలోపు వైశాలి, అభిలాష్, ఆనంద్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. మూడేళ్ల నుంచి తన భార్యకు దూరంగా, గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌లోని అక్క లక్ష్మి ఇంట్లోనే ఉంటున్నాడు. కొంత కాలం నుంచి ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయం మద్యం తాగి ఇంటికి రావడంతో తమ్ముడిని సోదరి లక్ష్మి మందలించింది. దీంతో తాను తన ఇంటికి వెళ్తానని చెప్పి బంగ్లా వెంకటాపూర్‌లో బస్సు ఎక్కి నాచారం వద్ద దిగాడు. అక్కడ హల్దీవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

# ముగ్గురిపై హోటల్ సిబ్బంది దాడి

తీవ్రంగా గాయపడి ఒకరు మృతి



హరికృష్ణ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: హోటల్‌లో భోజనం చేయడానికి వెళ్లిన ముగ్గురిపై దాడి చేసిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు కథనం ప్రకారం .. చైతన్యనగర్ కాలనీకి చెందిన హరికృష్ణ (48), ఈ నెల 9న రాత్రి కాలనీకి చెందిన డప్పు రాజేష్ కుమార్, నీరుడి రాజకుమార్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని మేరాజ్ బావర్చి హోటల్‌కు భోజనం చేసేందుకు వెళ్లారు. భోజనం ఆర్డర్ చేశాక హోటల్ యజమాని అమీర్, అతని సిబ్బంది భోజనం లేదు.. ఏం లేదని ముగ్గురిపై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణను చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరిగి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఈఎస్ఐ సనత్‌నగర్‌కు తరలించగా, అక్కడ పది రోజులపాటు చికిత్స అందించి, ఇంటికి పంపారు. ఇంటికి వచ్చిన హరికృష్ణ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు నిఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కోనాయిపల్లిలో వడ్డెర కులానికి చెందిన దంపతులు మమత, కనకరాజు(28)లు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్ళారు. కనకరాజు తల్లి ఎల్లవ్వ అనారోగ్యానికి గురవ్వడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ కోనాయిపల్లిలోనే ఉందామంటూ భార్యకు చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. దీంతో భార్య మమత ఈనెల 23న ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై అదే రోజు కనకరాజు పురుగు మందు తాగడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**మద్యం మత్తులో..**



లక్ష్మీనారాయణ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): మద్యం మత్తులో మంజీరా నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొడుపాక గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లష్కర్ లక్ష్మీనారాయణ (35) మద్యానికి బానిసగా మారాడు. ఆదివారం అతిగా మద్యం సేవించి వ్యవసాయ క్షేత్రం సమీపంలోని రుద్రపాదాల వద్ద మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వెలికితీశారు. కాగా మృతుడికి భార్య మేఘమాల, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది.

# మానవత్వానికి ప్రోత్సాహకం

- ● క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే రూ.5 వేలు నజరానా
- ● అందుబాటులోకి గుడ్ సమరిటన్ పథకం
- ● రోడ్డు ప్రమాదంలో మృత్యువాతలను తగ్గించేందుకు చర్యలు



జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం

సంగారెడ్డి క్రైమ్: నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరిగి అక్కడికక్కడే కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. సకాలంలో ఆస్పత్రికి తరలించకపోవడం, వైద్య సేవలు సమయానికి అందకపోవడంతో మృత్యువాత పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ప్రమాదాలు చూసిన వారు కూడా పోలీస్ కేసులు వంటి అపోహలతో పట్టించుకోకుండా వెళ్లి పోతుంటారు. పైగా క్షతగాత్రులను వీడియో తీస్తుంటారు. దీన్ని నివారించేందుకు ప్రమాద బాధితులను వెంటనే ఆస్పత్రులకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ (ప్రాణదాత) అనే కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. రోడ్డు ప్రమాదాన్ని చూసిన వారు క్షతగాత్రులను గోల్డెన్ అవలర్‌లో ఆస్పత్రికి తరలిస్తే ఈ పథకం కింద సాయం చేసిన వారికి కింద కొంత నగదు అందజేస్తుంది. దీంతో 50 శాతం మరణాలను నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ఆన్‌లైన్ దరఖాస్తు విధానం**

కేంద్రం 2021లో గుడ్ సమరిటన్ (ప్రాణదాత) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ ప్రోత్సాహకం పొందాలంటే బాధితుడిని గంటలోపు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పోలీసుల లెటర్ ప్యాడ్ పై ప్రాణదాత అంటూ పేర్కొంటూ ప్రమాదానికి సంబంధించిన వివరాలతో కాపీ ఇస్తారు. ఈ కాపీతో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు గాను రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు నగదు అందుతుంది. ఒక ఏడాదిలో ఎక్కువ మందిని కాపాడిన పది మందిని ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున అందిస్తారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో 852 ప్రమాదాలు జరుగగా, 384 మంది చనిపోయారు. 913 మంది గాయాలపాలయ్యారు.

**అవగాహన కల్పిస్తాం**



రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పౌరులు గాని, ప్రజలు గాని తమ వంతు బాధ్యతగా సహాయక చర్యలు చేపట్టాలి. ప్రజలకు గుడ్ సమరిటన్ పథకం పై విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. రోడ్డు ప్రమాదం సమాచారం ఇస్తే పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని గుర్తించాలి. ప్రమాదం జరిగిన వెంటనే 100 డయల్ తప్పనిసరిగా చేస్తే పోలీసులు అక్కడికి చేరుకుంటారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేస్తాం.

– రమేశ్ , పట్టణ సీఐ

# ర్యాపిడో రైడర్ దుర్మరణం



లారీ కిందపడి దుర్మరణం చెందిన జగన్నాథ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఓ ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందిన సంఘటన తెల్లాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేటకు చెందిన జగన్నాథ్(35), ర్యాపిడో రైడర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం తన బైక్‌పై విధులకు బయలుదేరాడు. గచ్చిబౌలి నుంచి తెల్లాపూర్‌కు వెళ్లేందు వీపీకుమార్ ర్యాపిడో బుక్ చేసుకున్నాడు. జగన్నాథ్ అతడిని ఎక్కించుకోని తెల్లాపూర్ బయలుదేరాడు. హుడాకాలనీ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో జగన్నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున వీపీ కుమార్ గాయాలపాలయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### వివాహిత ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వరకట్నం వేధింపులు తాళలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నిజాంపూర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. పట్టణంలోని వీరభద్రనగర్‌కు చెందిన పావని(27)కి, సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన ఆలంపల్లి సాయికిరణ్‌తో 2022లో వివాహం చేశారు. వీరికి పది నెలల కుమార్తె ఉంది. వివాహమైన సంవత్సరం నుంచే అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త, మరిది తరచూ వేధించేవారు. దీంతో మనస్తాపానికి గురైన పావని శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త ఆమెను సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.